క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు: ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ ఎస్ మోహనరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని చెరుకూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులతో మాట్లాడారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా రైతులు తాము కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ గిట్టుబాటు ధరలతో అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో నాగులపాలెం పీఏసీఎస్ ప్రెసిడెంట్ అడ్డగడ సుబ్బారాయుడు, డైరెక్టర్ కొల్లా శేషగిరిరావు, బాపిరెడ్డి, వైస్ ఎంపీపీ పాలేటి వీరయ్య, సంఘ సీఈవో అమర్నేని తులసి రైతులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం


అల్పాహారం అందజేస్తున్న దాతలు, హెచ్ఎం

చినగంజాం: ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలోని కడవకుదురు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తుండటంతో దాతలు అల్పాహారం అందజేస్తున్నారు. గ్రామానికి చెందిన చీమకుర్తి కృష్ణ జ్ఞాపకార్థం కుమారుడు చీమకుర్తి ప్రభాకర్ 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా సోమవారం విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ దొంగకు జైలు శిక్ష



వివరాలు తెలుపుతున్న ఎస్సై తిరుపతిరావు

జే.పంగులూరు: పలు ప్రాంతాల్లో బైకు దొంగతనాలు చేసిన కేసులో నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి మండలం పాపిరెడ్డి గ్రామానికి చెందిన వర్రా సుబ్బారెడ్డిని రేణింగవరం పోలీసులు గతంలో బైకు దొంగతనం కింద పట్టుకొని కోర్టుకు హాజరుపరిచారు. కోర్టుకు పోలీసులు పూర్తి ఆధారాలు అందించటంతో సుబ్బారెడ్డికి అద్దంకి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నూతక్కి ప్రియదర్శిని ముద్దాయికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ. 100 జరిమానా విధించారు. కేసులో ముద్దాయికి శిక్షపడే విధంగా కృషి చేసిన ఎస్సై కేకే తిరుపతిరావు, కోర్టు కానిస్టేబుల్ జె. మత్తయ్యను అద్దంకి మెజిస్ట్రేట్ అభినందించారు.

ముగిసిన మదనగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు


చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న రుక్మిణి సత్యభామ సమేతశ్రీ మదనగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వైఖానసాగమన ప్రకారంగా త్రయాహ్నిక దీక్షతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. సోమవారం చక్రస్నానం, మహా పూర్ణాహుతి, ధ్వజావరోహణ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆర్వీ రంగాచార్యులు నిర్వహించగా ఆలయ 14వ ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహన మురళీధరరావులు హాజరయ్యారు. కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ మేనేజర్ టీవీ శివనాగదాసు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు సందర్భంగా భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

చీరాల అర్బన్: రాష్ట్రస్థాయి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోటీల్లో పాల్గొన్న స్థానిక పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులను సోమవారం ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్ అభినందనలు తెలిపారు. ఆదివారం నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు అచ్చుత సోమనాథ్, దిడ్ల మనోజ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమొంటో, ప్రశంస పత్రాలను అందించి గైడ్ ఉపాధ్యాయులు పి.భానుచంద్రమూర్తి, రాజేంద్రప్రసాద్, వై.గాంధీ, చంద్రశేఖర్, రమణారావులు అభినందించారు.

నల్ల బంగారమే

- అమ్మకానికి సిద్ధంగా నల్లచెరకు
- నియోజకవర్గంలో 800 ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ. 2.5 లక్షలు, గడ రూ.15 వంతున కొనుగోలు
- తిరునాళ్లు, జాతర్లు ప్రారంభమైతే పెరగనున్న గిరాకీ

బల్లికురవ: వాణిజ్య పంటల ఆటుపోట్లు, వరిసాగుకు పెట్టుబడులు పెరగటంతో నల్లచెరకు సాగు విస్తీర్ణం పెరిగింది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిశాయి. దీనికి తోడు వాతావరణం అనుకూలించటంతో చెరకు గడలు దిగుబడులతో గిరాకీ పెరిగింది. బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం నల్ల చెరకు సాగుకు పెట్టింది పేరు. రైతులు హెచ్‌వీడీఎస్ పథకంలో బోరు ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్, డ్రిప్ ఇరిగేషన్‌తో నీటి వృథా లేకుండా పంటలు పండిస్తున్నారు.

800 ఎకరాల్లో చెరుకు సాగు..

బల్లికురవ మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాల్లో 15 ఏళ్ల క్రితం పది ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడులు పోను నికరఆదాయం దక్కటంతో ఈ రెండు గ్రామాలకు తోడు వైదన, కొప్పరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, రామాంజనేయపురం, అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం చక్రాయపాలెం, గ్రామాలకు సాగు విస్తీర్ణం విస్తరించింది. 800 ఎకరాల వరకు సాగు చేశారు. ప్రస్తుతం తోటల్లో గడలు ఆరు నుంచి 7 అడుగుల ఎత్తు వరకు పెరిగి పక్వానికి వచ్చి అమ్మకానికి సిద్ధమయ్యాయి. ఎకరాకు 12 వేల నుంచి 13 వేలవరకు అడుగు ముక్కలు చేసి తొలకరి వర్షాలకు మే చివరి వారం నుంచి జూన్ చివరి వారంలోపు బోదెలు చేసి నాటారు.

అమ్మకానికి సిద్ధం..

సకాలంలో వర్షాలు కురవటం వాతావరణం అనుకూలించటం తోటల్లోని గడలు అమ్మకానికి సిద్ధమయ్యాయి. వ్యాపారులు తోటల వద్దకు వచ్చి ఎకరాలకు రూ. 2.5 లక్షలు చెల్లించి లేదా గడ ఒక్కొక్కటికి రూ. 15 వంతున కొనుగోలు చేస్తున్నట్లు రైతులు సాక్షికి వివరించారు. ఎకరా తోటలో 20 వేల గడల నుంచి 21 వేలవరకు దిగుబడులు వస్తున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 15 నుంచి రాష్ట్రంలో జరిగే వివిధ తిరునాళ్ల ఉత్సవాలకు ఇక్కడ నుంచే చెరుకుగడలను వ్యాపారులు కొనుగోలుతో ఎగుమతి చేస్తారు. సొంత భూమిలో సాగుదారుకు రూ. లక్ష పెట్టుబడి, కౌలు భూమి సాగుదారుకు రూ. 1.4 లక్షలు అవుతున్నట్లు రైతులు వివరించారు.


గొర్రెపాడులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న చెరకు తోటలు

రోడ్లపైనే అమ్మకాలు..

గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు అర ఎకరా నుంచి ఎకరా వరకు పొలాన్ని కౌలుకు తీసుకుని చెరకు సాగు చేశారు. గడలు అమ్మకానికి సిద్ధంతో గడలు ఆటోల్లో వేసుకుని ప్రతిరోజు మేదరమెట్ల-నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని కొప్పరపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంతానికి తెచ్చి అమ్మకాలు చేపడుతున్నారు. పది గడలకు ఒక కట్టగా కట్టి రూ. 170 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ రోడ్డుతోపాటు కొప్పరపాడు-వినుకొండ, రోడ్లల్లో కూడా అమ్మకాలు జరుగుతున్నాయి. హోల్ సేల్ రిటైల్ అమ్మకాలు జరుగుతున్నాయి. హోల్‌సేల్ రిటైల్ అమ్మకాలకు కొప్పరపాడు సెంటర్ పెట్టింది పేరు.


ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న లారీ


నామ్ రహదారి కొప్పరపాడులో చెరకు అమ్మకాలు

ఎకరన్నరలో సాగు చేశా..



ఎకరన్నర పొలం కౌలుకు తీసుకుని చెరకు సాగు చేశా. ఆరేళ్లుగా చెరుకు సాగుతో పెట్టుబడులు పోనూ నికరఆదాయం పొందుతున్నా. అమ్మకాల్లో తన భార్య సహకారం అందించటం వల్లే కూలీ ఖర్చులు తగ్గాయి. తిరునాళ్ల నుంచి గిరాకీ పెరిగే అవకాశాలున్నాయి.

– పులి శరత్, కూకట్లపల్లి

దళారుల బెడదలేదు..



ఎనిమిదేళ్లుగా చెరకు సాగుచేస్తున్నాను. దళారుల బెడద లేదు. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి ఎకరాలు, గడల వంతున కొనుగోలు చేస్తున్నారు. మహాశివరాత్రి నుంచి అమ్మకాలు ఊపందుకుంటాయి. రెండు నెలలపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరునాళ్ల ఉత్సవాలకు ఇక్కడ నుంచే గడలు ఎగుమతి అవుతాయి.

– తాడిపర్తి అంజిరెడ్డి, కూకట్లపల్లి

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి మూల విరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణ మాఘ మాసం ఆశ్లేష నక్షత్రం విదియ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

గోవా మద్యం పట్టివేత

అద్దంకి రూరల్: అక్రమంగా ఇంట్లో నిల్వ ఉంచిన గోవా మద్యం బాటిళ్లను మంగళగిరి ఏసీబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో సోమవారం రాత్రి పట్టుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి సమీపంలో పట్టుబడ్డ కేసులో విచారిస్తుండగా అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం నుంచి రవాణా జరుగుతున్నట్లు సమచారం అందడంతో సిబ్బంది దాడిచేశారు. గ్రామానికి చెందిన ఏ. శ్రావణ్ కుమార్ ఇంటి వద్ద ఉన్న 576 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సచివాలయ వ్యవస్థతో పారదర్శక సేవలు


వృద్ధురాలితో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య
- రూ. 4 లక్షలతో కాలనీ రోడ్డుకు భూమిపూజ

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కూకట్లపల్లి సచివాలయం పరిధిలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామాల నుంచి పద్మజానగర్ కాలనీకి వెళ్లే రోడ్డు అధ్వాన స్థితికి చేరిందని, దానిని అభివృద్ధి పరచాలని శనివారం జరిగిన గడప గడపకు కార్యక్రమంలో కాలనీ వాసులు చైతన్యకు విన్నవించారు. మండల నిధుల్లో రోడ్డు అభివృద్ధికి రూ.4 లక్షలు కేటాయించి భూమిపూజతో పనులకు శ్రీకారం చుట్టి, ప్రమాణాల మేర అభివృద్ధి పరచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జనరంజక పాలనతో దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్యానికి, సంక్షేమానికి పాటుపడుతున్న జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా ఆశీర్వదించాలని చైతన్య కోరారు. కార్యక్రమాల్లో పార్టీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, ఉపాధ్యక్షుడు ఇప్పల వెంకటసుబ్బారెడ్డి, స్థానిక నేతలు ఇప్పల అంజిరెడ్డి, రామరెడ్డి, గుంటక నాగిరెడ్డి, జీ మల్లారెడ్డి, టీ విజయభాస్కర్‌రెడ్డి, తాళ్ల రవీంద్రారెడ్డి, బోళ్ల ఏడుకొండల రెడ్డి, చింతల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కల్యాణమస్తు, షాదీతోఫాకు దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ: ప్రభుత్వం వివాహాలు చేసుకునే జంటలకు అందజేస్తున్న కల్యాణమస్తు, షాదీ తోఫాకు గ్రామ సచివాలయాల్లో అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సోమవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు వివాహానికి రూ.1 లక్ష, కులాంతరమైతే రూ. 1.2 లక్షలు బీసీ వివాహానికి రూ. 50 వేలు, కులాంతరమైతే రూ. 75 వేలు, మైనార్టీ వివాహానికి రూ.1 లక్ష, దివ్యాంగుల వివాహానికి రూ. 1.5 లక్షలు, భవన నిర్మాణ కార్మికుల వివాహానికి రూ. 40 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. వివాహ శుభలేఖలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

మార్చిలోపు వందశాతం వసూళ్లు తప్పనిసరి

చీరాల టౌన్: గ్రామాల్లో పెండింగ్ బకాయిలు, ఇంటి పన్నుల వసూళ్లను మార్చి నెలాఖరులోపు 100 శాతం వసూళ్లు చేయాలని ఈవోఆర్డీ మురళీబాపూజీ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సోమవారం ఈవోఆర్డీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. అన్నీ గ్రామ పంచాయతీలు గ్రామాల్లోని బిల్ కలెక్టర్లు, వలంటీర్లతో మార్చి నెలాఖరులోపు పన్నుల వసూళ్లు పూర్తి చేయాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే గ్రామాలన్నీ సుందరంగా ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా చేసి గ్రామాలను రోగాల నుంచి కాపాడాలన్నారు. ప్రతి పంచాయతీకి విధిగా ఫాగింగ్ యంత్రం కొనుగోలు చేసి వినియోగించి దోమల నిర్మూలన చర్యలు చేపట్టారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం


లబ్ధిదారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం చీరాల పట్టణంలోని 9వ వార్డులోని ఆంధ్రరత్న నగర్ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఏమేరకు వారి దరిచేరుతున్నాయోనని వారిని అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నర సంవత్సర కాలంలో అందిన పథకాలను వారి మాటల్లోనే తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కమిషనర్ ఐసయ్య, 9వ వార్డు కౌన్సిలర్ మల్లెల లలిత, కౌన్సిలర్లు గోలి స్వాతి, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, చీమకుర్తి బాలకృష్ణ, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, తోకల అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెల రాజశేఖర్, గొర్రెముచ్చు సోని, దేట విజయ్, అశోక్, కాగితాల ఉదయ్, మల్లెల రత్నరాజు, గోలి గంగాధర్, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

చినగంజాం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంజూరైన గృహాల నిర్మాణాలను మొదలు పెట్టి వేగవంతంగా నిర్మించుకునేలా చూడాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండలంలోని గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మంజూరైన అన్ని గృహాలను బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావడం, 15 రోజుల్లో శ్లాబ్ స్థాయి గృహాలను పూర్తి చేయడం, బేస్‌మెంట్ మొదలు పెట్టని గృహాలకు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. వారాంతర లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయడం, ప్రతి శనివారం హౌసింగ్ డేని పురస్కరించుకొని పర్యవేక్షణ చేయడం నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కే స్వరూపరాణి, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

28లోపు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

చీరాల టౌన్: చీరాల ఉపఖజానా కార్యాలయం నుంచి పింఛన్లు తీసుకుంటున్న ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఫించన్‌దారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఈనెల 28లోగా ఉప ఖజానా కార్యాలయంలో అందించాలని ఎస్టీవో కె.భాగ్యలక్ష్మీ సూచించారు. ఈమేరకు సోమవారం ప్రకటనలో ఎస్టీవో తెలిపారు. చీరాల ఉపఖజానా కార్యాలయం పరిధిలో 3380 మంది విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు నెలనెలా పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. వీరిలో 330 మంది తమ లైఫ్ సర్టిఫికెట్లు అందించారని, మిగిలిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 28లోగా సర్టిఫికెట్లు అందించాలని ఎస్టీవో సూచించారు.

జాగ్రత్తలు పాటిస్తే కుష్టువ్యాధి నివారణ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

చినగంజాం: కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్య చికిత్స అందిచటం ద్వారా నయం చేయవచ్చని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ పీ వెంకటేశ్వరరావు అన్నారు. కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోవైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కుష్టు నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే సూక్ష్మ క్రిమి సోకడం వలన వ్యాధి సోకుతుందని, శరీరంపై స్పర్శలేని రాగి, గోధుమ వర్ణం మచ్చలు ఉన్నట్లయితే కుష్టుగా అనుమానించి తగిన వైద్యపరీక్షల ద్వారా నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. వైద్యాధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ తొలిదశలో వ్యాధిని గుర్తిస్తే బహుళ ఔషధ చికిత్స ద్వారా కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, మంచి ఆహారపు అలవాట్ల ద్వారా వ్యాధి నిరోధక శక్తిని కల్గి ఉంటే ఈవ్యాధి సోకకుండా చూసుకోవచ్చని హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్ హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారి, హెల్త్ సూపర్ వైజర్ పీవీ సుబ్బారావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

55 మందికి కంటి పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

చినగంజాం: మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో సచివాలయంలో సోమవారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వైఎస్సార్ కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ సచివాలయ పరిధిలో 60 ఏళ్ల పైబడి కంటి చూపు మందగించిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. దగ్గుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన పారామెడికల్ అఫ్తాల్మిక్ అధికారి ఎస్ సుధాకర్ 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 27 మందికి కంటి అద్దాలు అవసరమైన వారిని గుర్తించి వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. కళ్ల జిల, మంటలు అని గుర్తించిన వారికి కంటి చుక్కలు మందును, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎన్ హరిప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ పీవీ సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌సీ ఆమని, ఆరోగ్య కారకర్త సింగమ్మ, ఆశ కార్యకర్తలు అజంతా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయగణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న కరణం వెంకటేష్

వేటపాలెం: పందిళ్లపల్లిలో వేంచేసియున్న విజయ గణపతి ఆలయం వద్ద స్వామి వారి 21వ వార్షిక మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరై స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, పృథ్వీ చంద్రమోహన్, బండి కల్ల నరేష్, ఆవుల అశోక్, జిడుగు మస్తాన్, భాస్కర్ రెడ్డి, రాఘవ, సజ్జా చంద్ర, గుత్తి బాలయ్య, కొలుకుల వెంకటేష్, నంగు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీశ్వరరావు సహకారం మరువలేనిది


ఢిల్లీశ్వరరావును సత్కరిస్తున్న ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు

చీరాల టౌన్: వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలోని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌లో హవల్దార్ మేజర్‌గా విధులను సమర్థవంతంగా నిర్వహించి బదిలీపై సికింద్రాబాద్ వెళ్తున్న ఢిల్లీశ్వరరావు సేవలు అజరామరమని పలవురు ఎన్‌సీసీ అధికారులు కొనియాడారు. చీరాల ఎన్‌సీసీ యూనిట్ నుంచి సికింద్రాబాద్‌కు బదిలీపై వెళ్తున్న ఢిల్లీశ్వరరావును కళాశాల ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌సీసీ యూనిట్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారులు మేడికొండ రాజేష్‌బాబు, సుబేదార్ సత్యేంద్ర, జేసీవో నాయక్‌లు మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లకు చక్కగా తర్ఫీదును అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఢిల్లీశ్వరరావు కృషి అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లతో, ఎన్‌సీసీ అధికారులు, కళాశాల ప్రతినిధులతో సత్సంబంధాలు కలిగిన ఆయన ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది ఉన్నారు.